



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం

22 ఏప్రిల్ 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


# కాళేశ్వరం అక్రమాలపై
# మీరే విచారించండి

**సీబీఐతోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయించండి.. సీబీఐకి పంపిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వం**

**ఆర్నెల్ల తర్వాత స్పందించిన సీబీఐ.. రాష్ట్ర పోలీసులు కేసు పెట్టలేదని స్పష్టీకరణ**

**ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేయాలన్న విజ్ఞప్తి**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కేసులో సీబీఐనే స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని స్పష్టం చేస్తూ తాజాగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాసింది. గత ఏడాది సెప్టెంబరు మొదటి వారంలోనే ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినా, దాదాపు ఆరు నెలల తర్వాతే కేంద్ర దర్యాప్తు సంస్థ స్పందించింది. ఈ నేపథ్యంలో 'రాష్ట్ర పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారా?' అని సీబీఐ అడగగా, ఇప్పటివరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని రాష్ట్రం స్పష్టం చేసింది. దీంతో సీబీఐనే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించాలని

(మిగతా 2వ పేజీలో)

## ఘోష్ కమిషన్‌పై హైకోర్టులో నేడే తీర్పు



- కేసీఆర్, హరీశ్‌రావు సహా పలువురి పిటిషన్‌లపై తీర్పు
- మార్చి 12న విచారణ పూర్తిచేసిన ధర్మాసనం
- జీవో 6 చెల్లుబాటుపై రానున్న స్పష్టత



## కాల్పుల విరమణపై ట్రంప్ యూటర్న్!

- పాక్ అభ్యర్థనతో గడువు పొడిగింపు నిర్ణయం
- ఇరాన్‌తో ఒప్పందం వరకూ కొనసాగుతుందన్న అమెరికా పోర్టుల దిగ్బంధనం మాత్రం యథాతథం
- శాంతి చర్చలపై ఇంకా అనిశ్చితి
- ముందుగా కఠిన వ్యాఖ్యలు చేసిన ట్రంప్ వైఖరిలో మార్పు
- పాక్ దౌత్య ప్రయత్నాలతో తాత్కాలిక ఉపశమనం

ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక మలుపు తీసుకున్నారు. పాకిస్తాన్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటూ కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో చేసిన పోస్టులో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇరాన్‌తో ఏకీకృత ఒప్పందం

(మిగతా 2వ పేజీలో)



## వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం : హరీశ్

**పోటీ సభతో సీఎం సంకుచిత బుద్ధి బయటపడిందని ఆరోపణ**

**ప్రసంగాల వీక్షణలో భారీ తేడా చూపిస్తూ బీఆర్ఎస్ వాదన**

**ఓటుకు నోటు కేసు ప్రస్తావనతో రాజకీయంగా దాడి**

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదురుతోంది. జగిత్యాలలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చేసిన ప్రసంగం, కాటారం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందనపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రయోజనాలపై కేసీఆర్ హుందాగా మాట్లాడితే, సీఎం మాత్రం వ్యక్తిగత వ్యాఖ్యలకే పరిమితమయ్యారని అన్నారు. కేసీఆర్ సభకు పోటీగా సభ నిర్వహించడం ద్వారా సీఎం సంకుచిత రాజకీయాలను బయటపెట్టుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రసంగాన్ని లక్షలాది మంది వీక్షించగా, సీఎం ప్రసంగానికి తక్కువ స్పందన రావడం ప్రజాభిమానాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రస్తుత సీఎంను ప్రస్తావించకుండా మాట్లాడితే, రేవంత్‌రెడ్డి మాత్రం బీఆర్ఎస్‌పై విమర్శలతోనే కాలం గడుపుతున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులో స్టే ఎత్తివేస్తే సీఎం నేరుగా జైలుకెళ్లే పరిస్థితి వస్తుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసులో విచారణ సుప్రీంకోర్టులో జరుగుతుండగా, ప్రభుత్వ తరఫున సాధారణ న్యాయవాదులను పెట్టి, వ్యక్తిగతంగా ఖరీదైన న్యాయవాదులను నియమించుకోవడం వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు కూడా ఇంప్లీడ్ అయినట్లు

(మిగతా 2వ పేజీలో)



## ప్రభుత్వంతో చర్చలు విఫలం.. అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న ఆర్టీసీ బస్సులు

- ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతల చర్చలు
- నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ కమిటీ
- తమ డిమాండ్లు పాతవేనని స్పష్టం చేసిన జేఏసీ
- అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించిన జేఏసీ

## తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచారం... మూగబోయిన మైకులు

**తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్**

**బెంగాల్‌లో 152 స్థానాలకు పోలింగ్.. మే 4న వెల్లడి కానున్న ఫలితాలు**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్ లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ద

(మిగతా 2వ పేజీలో)



## బ్యాంకింగ్ లోపాలే సైబర్ ముఠాలకు బలం

- మ్యూల్ ఖాతాల కేసులో 32 మంది బ్యాంకు సిబ్బంది అరెస్టు
- ఆర్బీఐ గవర్నర్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనర్ లేఖ
- కేవైసీ నిర్లక్ష్యం వల్లే మోసాలకు దారి
- బ్రాంచ్ అధికారులను బాధ్యులుగా నిలపాలన్న సూచన





## కేరళ త్రిస్సూర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- 13 మంది మృతి, మరో 13 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ
- గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం
- ఘటనపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తీవ్ర విచారం

త్రిస్సూర్ : కేరళలోని త్రిస్సూర్‌లో ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి 13 మంది ప్రాణాలు


(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ ప్రయాణికులకు శుభవార్త.. 8 కొత్త రైళ్లు ప్రకటించిన కేంద్రం


- తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని పెంచుతూ 8 కొత్త వీక్లీ రైళ్లు
- కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి ఈ రైళ్లు నడపనున్నట్లు వెల్లడి
- తిరుపతి, భువనేశ్వర్, జైపూర్ వంటి నగరాలకు మెరుగైన ప్రయాణం


# కర్నే అరవింద్ దశదిన కార్యక్రమానికి కదలి వచ్చిన గులాబీ రాష్ట్ర నేతలు, పలు పార్టీల నాయకులు



- కర్నే అరవింద్ జోహార్లు పాట సి.డి ఆవిష్కరించిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు
- కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, రాష్ట్ర నాయకులు
- నివాళులర్పించడానికి తరలివచ్చిన గులాబీ శ్రేణులు, సంస్థాన్ మిత్రులు
- నల్లగొండ గద్దర్ పాటకు కంటతడి పెట్టిన మహిళలు, కర్నే అరవింద్ మిత్రులు
- కర్నే అరవింద్ కు జోహార్లు అంటూ పార్టీ శ్రేణుల, మిత్రుల నినాదాల హోరు







హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి

ఇబ్రహీంపట్నం బొంగులూరు వైఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ స్పోక్స్ పర్సన్ కీ"శే కర్నే అరవింద్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, పలువురు రాష్ట్ర నాయకులు, గులాబీ శ్రేణులు పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యేలు హాజరై కర్నే అరవింద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు

## - మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా కర్నే అరవింద్ కు జోహార్లు పాట సి.డి ఆవిష్కరణ

ప్రముఖ గాయకుడు పాశం రాము రచన, గానం చేసిన కర్నే అరవింద్ జోహార్లు పాట సి.డి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, మాజీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సిడి ఆవిష్కరణలో పలువురు నేతలు పాల్గొన్నారు పాటలు బాగున్నాయని గాయకుడ్ని ప్రశంసించారు

## - కర్నే అరవింద్ కు నివాళులర్పించడానికి తరలివచ్చిన గులాబీ శ్రేణులు, సంస్థాన్ మిత్రులు

కర్నే అరవింద్ దశదిన కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి ,నల్లగొండ పలు జిల్లాల నుంచి తరలివచ్చిన గులాబీ శ్రేణులు, స్వగ్రామం నుంచి వచ్చిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు, మాజీ సర్పంచ్ సికీలమెట్ల శ్రీహరి, సీనియర్ పాత్రికేయులు బద్దుల మల్లేష్ యాదవ్, గణేష్ సాగర్, ఏలే భాస్కర్, వారాహి ఇన్ఫ్రా ఎండి రాసాల రమేష్ సాగర్, ప్రముఖ న్యాయవాది రాపర్తి వెంకటేష్ గౌడ్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాసాల యాదయ్య సాగర్, తెలంగాణ బిక్షం, అక్కనపల్లి వీరయ్య ఢిల్లీ వెంకట్, నీళ్ల లింగస్వామి గౌడ్, మండలంలోని పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## - ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్ పాటకు కన్నీళ్లు పెట్టిన మహిళలు

కర్నే అరవింద్ దశదిన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రముఖ గాయకులు నల్లగొండ గద్దర్, మానుకోట ప్రసాద్, సందీప్ హాజరై వారి చిత్రపటానికి ఘన నివాళులర్పించి. ఆ వేదికపై కర్నే ప్రభాకర్ సూచన మేరకు వారు పాడిన పాటలకు కంటతడి పెట్టిన మహిళలు, హాజరైన జనం కర్నే అరవింద్ తను చిన్నప్పటినుంచి పాటలు పాడే విషయాన్ని పలువురు మిత్రులు గుర్తు




చేసుకున్నారు

## - కర్నే అరవింద్ దశదిన కార్యక్రమానికి హాజరైన పలు పార్టీల నాయకులు

కర్నే అరవింద్ దశదిన కార్యక్రమానికి హాజరైన పలు పార్టీల నాయకులు బిజెపి నాయకులు ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పలువురు కార్పొరేటర్లు, నగర బాధ్యతలు కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు మాజీ నగర మేయర్ బొంతు రామ్మోహన్ గౌడ్, బిజెపి, కాంగ్రెస్, బీఎస్ పి, కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే, టిడిపి, పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ పిలుపుమేరకు రాష్ట్రంలోని పార్టీలకు అతీతంగా అనేకమంది నాయకులు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# రాయికల్ మండలంలో ఉద్యాన పంటల పరిశీలన





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 21

జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీమతి కె. లత రాయికల్ మండలంలోని ఆలూరు, వీరాపూర్, ధర్మాజీపేట, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లోని పలు ఉద్యాన పంటల సాగు, మల్బరీ సాగు, మష్రూమ్ పంట సాగును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలూరు గ్రామంలోని ఎలిపెద్ది రాజు పండిస్తున్న పుచ్చ, బీర, టమాట పంటలను పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది. టమాట పంటలో ఎండు తెగులును నివారించడానికి భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్యను ట్రైకోడర్మా విరిడి వంటి జీవన ఎరువుల వాడకంతో పెంచుకోవచ్చని సూచించారు. కోతుల బెడద నుండి కూరగాయలను కాపాడటానికి స్వంత ఖర్చుతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్న రైతును అభినందించడం జరిగింది. అలాగే వచ్చే నెలలో కోతకు రానున్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి, మొక్కలకు సక్రమంగా డ్రిప్ ద్వారా నీటిని అందించినట్లయితే గెలల బరువు పెరుగుతుందని సూచించారు. వీరాపూర్ గ్రామంలోని ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతి తో సాగు చేస్తున్న లిల్లి పూల సాగును పరిశీలించి సస్యరక్షణ చర్యలు వివరించడం జరిగింది. ధర్మాజిపేట, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లోని పట్టు పరిశ్రమ షెడ్డు నిర్మాణాలను పరిశీలించడం జరిగింది. మల్బరీ సాగు వల్ల కేవలం నెల రోజుల్లో ఆదాయం పొందవచ్చని, ఉద్యాన శాఖ ద్వారా షెడ్డు నిర్మాణానికి రైతుకు రూ. 2,25,000/- సబ్సిడీ అందజేయబడునని తెలిపారు. రాయికల్ పట్టణంలోని పుట్టగొడుగుల పెంపక కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. 45 రోజుల్లో అదాయాన్ని పొందే పట్టు పురుగుల పెంపకం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అలాగే ఈ సంవత్సరం ఉద్యాన శాఖ ద్వారా ప్లాస్టిక్ మల్చింగ్, కూరగాయల పందిరి, డ్రిప్ సదుపాయం వంటి వివిధ పథకాలకు రాయితీ అందజేయబడునని, ఆసక్తి గల రైతులు సంబంధిత ఉద్యాన అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కె. లత, జగిత్యాల్ నియోజకవర్గ ఉద్యాన అధికారి కె. స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి రాజేష్, ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది రాజేష్, కుమార్ డ్రిప్ కంపెనీ సిబ్బంది సురేష్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బడిబాట కార్యక్రమం





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 21

ప్రభుత్వ ఆదేశాల మేరకు “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక”లో భాగంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో నేడు అయోధ్య, కుమ్మరి పెల్లి, ఉప్పుమడుగు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విస్తృతంగా అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ గ్రామాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులను తప్పనిసరిగా బాలికల ఉన్నత పాఠశాల, రాయికల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరడమైనది. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, నోటుబుక్కులు, పౌష్టికాహారం తో కూడిన మధ్యాహ్న భోజనం మాత్రమే కాకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహారం, పాలను కూడా అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతులతో బోధన అందిస్తున్నారని, డిజిటల్ తరగతులు, స్మార్ట్ క్లాస్‌లు, విద్యార్థి కేంద్రిత బోధన విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో వ్యక్తిగత అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తున్నారని వివరించారు.గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించడంతో పాటు మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడం ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను మరింత పెంచిందని తెలిపారు. ఇది ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కోచింగ్, కెరీర్ మార్గదర్శనం, స్కాలర్‌షిప్ అవకాశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ భద్రత, సౌకర్యాల పరంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్ గౌడ్, మండలోజు రవీందర్, నాగరాజు, శ్రీకాంత్ గౌడ్, పద్మజ, వనిత, తిరుమల, అయోధ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శైలజ, వనమాల ప్రవళిక, విట్టల్, ఉప్పు మడుగు ప్రధానోపాధ్యాయులు నరసయ్య, ఉపాధ్యాయులు స్వరూప, శిరీష, రాజేశం, లావణ్య, కుమ్మరి పెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనంతో 48 ఏళ్లకు మళ్ళీ కలిసిన బాల్యమిత్రులు

### ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ జెఏసి చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య హాజరు





నల్లగొండ వార్త మిర్రర్ ప్రతినిధినల్గొండ నాగార్జున డిగ్రీ కాలేజ్‌కు చెందిన 1975--1978 బి.ఏ ఈ. పి. పి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా మంగళవారం నిర్వహించారు . హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతంలోని కినేరా గ్రాండ్‌లో 48 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనందభరిత వాతావరణంలో ఈ సమ్మేళనం కొనసాగింది. అందరిలోనూ అపూర్వమైన స్నేహబంధం మరింత బలపడింది.ఈ అపూర్వ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య హాజరయ్యారు. ఈ సమావేశాన్ని అభినందిస్తూ, పాత స్నేహితులు తిరిగి కలుసుకోవడం ఒక గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. సమాజంలో అనుబంధాలను బలపరచడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు కే. వెంకట్ నర్సయ్య, కర్ణం శ్రీకాంత్, పి. వెంకటరెడ్డి, ప్రేమకుమారి, సుశీల, సుధాకర్ రెడ్డి, సత్తయ్య, జనార్ధన్ రెడ్డి, ఎం.ఎ. మస్తాన్,రామస్వామి తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్న బాల్య మిత్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ సమావేశాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.

# నల్లగొండ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ భగీరథ జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

### జిల్లా నూతన ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఏకగ్రీవ నియామకం



నల్లగొండ వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర సగర సంఘం పిలుపుమేరకు నల్గొండ జిల్లా సగర సంగం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ భగీరథ జయంతి సందర్భంగా గోడ పోస్టర్లను ఆవిష్కరించి భగీరథ చిత్రపటాలను కండువాలను అన్ని గ్రామాలకు అందించడం జరిగింది.అదేవిధంగా జిల్లా కార్యవర్గాన్ని విస్తరించడం జరిగింది.. జిల్లా ఉపాధ్యక్షులుగా నేర్లకంటి సుధాకర్ సగర,పెండెం వెంకటేష్ సగర, కొలుగూరి రామకృష్ణ సగర, ఆలేటి జగన్ సగర,చింతల నిరంజన్ సగర, గంట శ్రీనుసగర,కార్యదర్శులుగా ఉంగరాల సైదులు సగర,గంట వెంకన్న సగర,నేర్లకంటి శంకరయ్య సగర,బలుగురి లక్ష్మయ్య సగర,కల్లెట్ల రాజు సగర, రాసాల వెంకన్న సగర,పెండ్యాల నాగరాజు సగర గార్లను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది.నల్లగొండ జిల్లా సగర సంగం అధ్యక్షుడు నేర్లకంటి రవికుమార్ సాగర్, తెలంగాణ రాష్ట్ర సగర సంఘం



ఉపాధ్యక్షులు కల్లెట్ల మారయ్య సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బలుగూరి కరుణాకర్ సాగర్,కోశాధికారి కొలుగూరి ప్రవీణ్ సాగర్, కొట్టాల గ్రామ సర్పంచ్ కల్లెట్ల లింగయ్య సాగర్, జోగిగూడెం గ్రామ సర్పంచ్ ఆలేటి యాదయ్య సాగర్ గార్ల ఆధ్వర్యంలో జరిగిన ఇట్టి కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షులు.. ప్రధాన కార్యదర్శులు.. కోశాధికారులు.సగర బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది



## విద్యార్థులకు విశ్వం ఎడ్యు టెక్ వారి ఐఐటీ-నీట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో విశ్వం ఎడ్యు టెక్ వారి ఐఐటీ - నీట్ ఫౌండేషన్ కోర్సు పూర్తి అయిన సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ తో పాటు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ గారు మాట్లాడుతూ ఐఐటీ-నీట్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రతి ఉపాధ్యాయుడు తెలుసుకోవడానికి అలాగే వారి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్ది ఎంతో ప్రయోజకులుగా మార్చవచ్చు. ఇంటర్ తర్వాత తీసుకునే ఈ కోర్సు ముందుగానే పాఠశాల పరిధిలోని విద్యార్థులకు నేర్పించడం ద్వారా వారు భవిష్యత్తులో చాలా తొందరగా మంచి ఇంజనీరింగ్, మెడిసిన్ కాలేజీ లో సీటు సంపాదించడానికి మా పాఠశాలలో నిర్వహించేటువంటి ఐఐటీ-నీట్ కోర్స్ చాలా ఉపయోగపడుతుంది. అదే విధంగా ఈ యొక్క కోర్సులో విజేతలు గా ఉన్న టాప్ ర్యాంకర్స్ కి అభినందనలు తెలుపుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అప్సర్, వెంకటేష్ , షారు, సంజన, రజిత, మంజుల, స్రవంతి, సౌజన్య, అనూష, కవిత, నిహారిక, సాయి హర్ష, మమత తదితరులు పాల్గొన్నారు.





## శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

### ఈనెల 23వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లను ఈనెల 23వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలకు హాజరుకావాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, దిండి శేఖర్ సగర, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మోడల రవి సగర, కోశాధికారి దిండి రామస్వామి సగర, రాష్ట్ర యువజన సంఘం కార్యనిర్వాక కార్యదర్శి గుంటి కృష్ణ సగర తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపల్లి ఉప మండలం అద్వర్యంలో జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.!

### బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షులు ఆంగోత్ కృష్ణ నాయక్



మహేశ్వరం వార్త మిర్రర్ ప్రతినిధి

దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి మరియు హిందూ సమాజం. కావున హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలపాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925లో ప్రారంభించబడి ఈ 100 సంవత్సరాల ప్రయాణంలో అనేక ఎత్తు పొలాలను చూసింది. నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాలను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరము ఉందని. హిందూ సమాజం పట్ల గౌరవభావం. ఏకాత్మత భావన. స్వధర్మం పట్ల అంకితభావం. సేవాగుణం వంటి వాటిని వికసింప చేసేందుకు మీ అందరి భాగ్యస్వామ్యమని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడమైనది. ఈ హిందూ సమ్మేళనంలోకొల్లూరు, భగీరథగూడ, పులి మక్త, వెంకన్నగూడ, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డి పల్లి తండ, హిందూ బంధువుల ఐక్యతతో ఈ హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు భారతీయ జనతా పార్టీ మహేశ్వరం మండల గిరిజన మోర్చా అధ్యక్షులు ఆంగోత్ కృష్ణా నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ శ్రీ దయానంద స్వామీజీ, ముఖ్య వ్యక్త లింగం సుధాకర్ రెడ్డి, మహిళా వక్త మౌనిక సుంకర ప్రముఖ న్యాయవాది విచ్చేస్తున్నారని వారి ప్రసంగాన్ని మనం విని చైతన్యం తెచ్చుకోవాలని కోరారు



## అయోధ్య శ్రీరామ రథానికి మూడో వార్డు భక్తుల ఘన స్వాగతం

వార్త మిర్రర్ రాయికల్ ఏప్రిల్ 21:

అయోధ్య శ్రీరామ మందిరం నుండి వచ్చిన శ్రీరామ రథానికి జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లోని మూడో వార్డు భక్తులు ఘన స్వాగతం పలికారు. భక్తి శ్రద్ధలతో మహిళలు మంగళ హారతులు ఇచ్చి దేవుని పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంతులు ఆశీర్వచనాలు అందించి భక్తులకు ధార్మిక సందేశాలు తెలియజేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సీతారాముల విగ్రహాలను భక్తి భావంతో పూజించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శ్రీరామ నామస్మరణతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల సమిష్టి పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# చదువులో రాణిస్తేనే సమాజంలో మంచి భవిష్యత్ ఉంటుంది..

### మండల విద్యాధికారి గురువారావు





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 21

చదువులో రాణిస్తేనే సమాజంలో మంచి భవిష్యత్ ఉంటుందని మండల విద్యాధికారి గురువా రావు అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని వివిఆర్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం రోజున ట్రినిటీ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ సిఐ జి మన్మధ కుమార్,మండల విద్యాధికారి గురువా రావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసం అభివృద్ధికి ఇలాంటి ప్రోగ్రామ్స్ ఉపయోగపడతాయన్నారు.విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఇష్టపడి చదవాలని కోరారు అలాగే ట్రినిటీ హైస్కూల్ యజమాన్యం కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ మరియు విద్యార్థులకు సమాజంలో ఎలా ఉండాలో సూచనలు చేస్తూ విద్యార్థి అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. మండల విద్యాధికారి గురువా రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అనేది ఇంతకుముందు యూనివర్సిటీలో ఉండేది సాంప్రదాయం కానీ కాలక్రమమైన ఇప్పుడు ట్రీట్ హైస్కూల్లో కూడా గ్రాడ్యుయేషన్ డే జరపడం ఎంతో అభినందనీయమని యజమాన్యాన్ని అభినందించారు అలాగే గ్రాడ్యుయేషన్ డే జరపడం చిన్నపిల్లల చదువు మీద మరింత శ్రద్ధ పెరిగి ఉన్నత చదువులు చదవడానికి ఆసక్తి కలుస్తుంది అన్నారు.అలాగే చిన్నపిల్లలకు తల్లిదండ్రులు అన్నం తినిపించేటప్పుడు చందమామను చూపించేది కానీ నేడు సెల్ ఫోను చూపించి అన్నం తినిపిస్తున్నారు సెల్ఫోన్ లేకుండా రోజు గడవడం లేదు కానీ తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోను వాడడం తగ్గించాలన్నారు పిల్లలు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులు తమ సెల్ ఫోను వాడకం తగ్గించి పిల్లలతో రోజు ఒక గంట సేపు వారితో గడిపితే పిల్లల్లో మార్పు వస్తుంది అన్నారు పిల్లలు చదువు పట్ల మరింత ఆసక్తి పెరిగి ఉన్నత చదువులు చదవడానికి ఆసక్తి చూపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ మండల కన్వీనర్ వెన్ రెడ్డి సంధ్యా రాజు,7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి,ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జని మంజుల,చింతల కరుణ, పబ్బు వంశీ, బడుగు శ్రీరాములు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# కుషాయిగూడలో నాగర్ కర్నూలు జిల్లా రైతుల ఆందోళన

**ఎత్తిపోతల ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతుల ధర్నా**

**25 గ్రామాలకు చెందిన 2500 మంది రైతులు**

**250 కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ సంస్థ**

**ధనుంజయ్ గుప్తా ఇంటి ముందు బైఠాయించ రైతులు**

**బాధితులకు అండగా పాశం యాదగిరి**





కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 21 : పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కింద నాగర్ కర్నూల్, కొల్హాపూర్ కు చెందిన భూమి కోల్పోయిన రైతులకు సంబంధించిన సుమారు 250 కోట్లు కొట్టేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ పేరుతో ఇట్యాల సాయిబాబా అనే ప్రధాన నిందితుడు ఇట్యాల ధనుంజయ్, ఇట్యాల బాలీశ్వర్, ఇట్యాల తుకారాం, నాగం కరుణాకర్ రెడ్డి, నాగం బుచ్చిరెడ్డి, రెవెల్లి జానకిరామ్ రెడ్డి, తాడురి శ్రీనివాస్ అనే వ్యక్తులతో కలిసి 250 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బాధిత రైతులు ఆరోపించారు. తక్కువ ధరలో భూములు ఇప్పిస్తానని, మంచి వడ్డీ ఇస్తామని నమ్మబలికి దాదాపు 25 గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది భూనిర్వాసితులు, రైతులకు సంబంధించిన 250 కోట్ల నష్ట పరిహారం డబ్బులు కొల్లగొట్టారు. ఘరానా దొంగల చేతిలో మోసపోయాని గ్రహించిన రైతులు హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిందితుల ఆస్తులు జప్తు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా ధనుంజయ్ గుప్తా అనే నిందితుడు హైదరాబాద్ కుషాయిగూడ సుభాష్ నగర్ కాలనీలో ఉంటాడని తెలుసుకుని మంగళవారం 25 గ్రామాలకు చెందిన సుమారు మూడు వందల మంది బాధిత రైతులు నిందితుడు ధనుంజయ్ గుప్తా ఇంటిముందు బైఠాయించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా పాశం యాదగిరి నిలిచారు. ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చట్టం ఉన్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని పాశం యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనుంజయ్ గుప్తా అనే నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి నిందితులను సంఘ బహిష్కరణ చేసి కాలనీ నుండి తరిమికొట్టాలని, సమాజం నుండి వెలివేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఫౌరసమాజం నిలబడి అన్నివిధాలుగా న్యాయం చేయాలని అందరినీ మేలు కోల్పాలని పాశం యాదగిరి పిలుపునిచ్చారు.

# పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా చక్రస్నానం

కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 21 : కాప్రా చెన్నకేశవ స్వామి ఆలయంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శన హోమం, హనుమాన్ హోమం, జాంబవంతుని హోమం, చక్ర స్నానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సమీప కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా గవర్నింగ్ కమిటీ సభ్యులు రాఘవులు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సభ్యులు లక్ష్మీ శేఖర్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఈఓ కృష్ణమా చార్యులు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ కొండారెడ్డి, డీఎన్, ప్రసాద్, కమిటీ మాజీ సభ్యులు పీసర మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, శంకర్ బాబు, మురళి పంతులు, విజయేందర్ రెడ్డి, మోహన్, గజేందర్ రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ టి. శ్రీనివాస్, ముఖేష్, మోహన్, విశ్వం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సోలిస్ కంటి ఆసుపత్రి సిబ్బంది సేవలు అందించారు.



# నాగారంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

**మూడున్నర కోట్ల విలువైన భూమికి టెండర్**

**87/2 సర్వే నెంబర్ లో 1200 గజాలు మాయం**

**తప్పుడు సర్వే నెంబర్లతో అనుమతులు**

**అక్రమ నిర్మాణాలు చేపడుతున్న మాజీ కార్పొరేటర్లు**

**ఎమ్మెల్యే మల్లారెడ్డి పేరును వాడుకుంటున్న మాజీలు**

**ఫిర్యాదులు చేసినా ఆగని అక్రమ నిర్మాణాలు**





నాగారం, వార్త మిర్రర్, ఏప్రిల్ 21 : ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ కీసర మండల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 87/2 లో సుమారు మూడున్నర కోట్ల రూపాయల విలువచేసే 1200 గజాల ప్రభుత్వ భూమి లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేరు ను వాడుకుంటూ, ఆయన అనుచరులైన ఇద్దరు మాజీ కార్పొరేటర్లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వేనెంబర్ 87/2 లో ఆరు ఎకరాల నాలుగు గంటల సీలింగ్ ల్యాండ్ ఉంది. ఈ స్థలాన్ని ఆనుకొని సర్వేనెంబర్ 87 లో చాముండేశ్వర్ నగర్ కాలనీ వెలిసింది. నగరానికి చెరువలో ఉన్న నాగారం డివిజన్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడ గజం స్థలం సుమారు 30 వేల రూపాయల పైనే ఉంటుంది. కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలనే ఆలోచనతో ఇద్దరు మాజీ కార్పొరేటర్లు సుమారు 1200 గజాల స్థలాన్ని 87/2 పార్ట్ అని తప్పుడు సర్వే నెంబర్లతో సుమారు 10 ఇండ్లకు అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన నాయకులే ఆక్రమణలకు పాల్పడితే ఎవరిని నమ్మాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన ఇద్దరు కార్పొరేటర్లు తమ పలుకుబడి, పరపతి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేరును వాడుకుంటూ మూడున్నర కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా కాజేస్తున్నారని స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు విమర్శిస్తున్నారు.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని తాసిల్దార్ పేర్కొన్నారు. సర్వే అనంతరం అక్రమ నిర్మాణం కూల్చివేస్తామని ఆయన అన్నారు. అనుమతులను రద్దు చేస్తాం: డిసి వాణి రెడ్డి... నాగారం డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 87/2 లో కీసర మండల తాసిల్దార్ నుంచి సర్వే రిపోర్ట్ రాగానే ప్రభుత్వ భూమి అని తేలితే అనుమతులను రద్దు( రీవోక్ ) చేస్తామని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధి అక్రమ నిర్మాణాలపై తిరుగుతూ ఫిర్యాదులు అందాయని తప్పుడు సర్వే నెంబర్లతో అనుమతులు పొందినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సర్వే రిపోర్ట్ రాగానే అక్రమ నిర్మాణం తొలగిస్తామని ఆమె పేర్కొన్నారు. ముమ్మాటికీ ప్రభుత్వస్థలమే:మాజీ కార్పొరేటర్ సర్వే నెంబర్ 87/2 లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ముమ్మాటికీ ప్రభుత్వ భూమిలోనివే అని తాజా మాజీ కార్పొరేటర్, మాజీ ఉపసర్పంచ్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ కౌకుట్ల శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు.




గతంలో తాము ప్రజా ప్రతినిధులుగా ఉన్నప్పుడు ఆరెకరాల నాలుగు గంటల స్థలానికి హద్దురాళ్ళు ఉండేవన్నారు. తాజా మాజీ కార్పొరేటర్లు కొమురెల్లి సుధాకర్ రెడ్డి, మోకా జగన్మోహన్ రెడ్డిలు 87 పార్ట్ అని తప్పుడు సర్వే నెంబర్లతో అనుమతులు పొంది ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని, సుమారు 1200 గజాల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా కు గురవుతుందన్నారు. సుమారు మూడున్నర కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని తామంతా జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, కీసర తాసిల్దార్, ఘట్కేసర్ డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రా నాగారంలో జరుగుతున్న ప్రభుత్వ భూమి ఆక్రములపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# చర్లపల్లి పారిశ్రామికవాడ సమగ్ర అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 21 : చర్లపల్లి పారిశ్రామికవాడ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘంలో చర్లపల్లి ఐలా, సిఐఎ పాలక వర్గం సభ్యులతో కలసి పారిశ్రామికవాడలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరించడంతో నిత్యం ఎంతో మంది ప్రయాణీకులు చర్లపల్లి పారిశ్రామిక వాడ మీదుగా ప్రయానిస్తున్నారు. అలాగే పారిశ్రామికవాడలో పని చేసేందుకు వేలాది మంది కార్మికులు ప్రయానించే చక్రీపురం కూడలి నుంచి గణేష్ టెంపుల్ కమాన్ వరకు రోడ్డు విస్తారణతో పాటు పారిశ్రామికవాడలో డ్రైనేజీ సమస్య పరిక్షరం వంటి సమస్యలను పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి చర్లపల్లి రైల్వేస్టేషన్ కు వేల్లే రహదారి, చక్రీపురం నుంచి గణేష్ టెంపుల్ కమాన్ వరకు రోడ్డు విస్తారణ చేపడుతామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం నిధులు మంజురు చేయిస్తానని తెలిపారు. అలాగే త్వరలోనే మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్ ను పారిశ్రామికవాడకు తీసుకువచ్చి ఎంపీ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారసు. ఈ కార్యక్రమంలో టిఫ్ చైర్మాన్ సూధీర్ రెడ్డి , ఐలా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, సిఐఎ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, కమిటి ప్రతినిదులు పిఎన్ మోహన్, తాటి శ్రీనివాన్, సుధాకర్ రెడ్డి , మాజీ చైర్మాన్ హరీష్ రెడ్డి, మిరుపాల గోపాలరావు, వేంకటేశ్వర్ రెడ్డి , మండ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**తాడువాయిలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల ధర్నా, రాస్తారోకో**

**లిభారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షులు పైడి విట్టల్ రెడ్డి**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్, 21

ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షులు పైడి విట్టల్ రెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో ఎల్లారెడ్డి, కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ నాయకులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. బయట మార్కెట్ లో దళారులు ఒక క్వింటాల్ మక్కలకు రూ. 1700 చెల్లించి కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో క్వింటాల్ కు రైతులు రూ.700 నష్టపోతున్నారని తెలిపారు. జిల్లాలో మక్కలు లేని చోట మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మక్కలు పండే ప్రాంతంలో మక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మక్కలు లేని చోట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఏం లాభం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తాడువాయిలో మక్కలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. లేని యెడల తాము పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. తాడ్వాయి సింగిల్ విండోలో ఇటీవల ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వెంటనే అవినీతి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద తరుగు పేరుతో అధికారులు దోపిడీ చేశారని ఆరోపించారు. ఒక్కో క్వింటాల్ కు రైతుల వద్ద రూ.70 వసూలు చేసి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. వెంటనే రైతుల బ్యాంకుల ఖాతాలో రైతుల నుంచి మినహాయించుకున్న డబ్బులను జమ చేయాలని ఆయన కోరారు. లేనియెడల సింగిల్ విండో వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ పార్టీ నాయకులు దేవి రెడ్డి విట్టల్ రెడ్డి, వెంకట్రావు, ప్రభాకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రాజిరెడ్డి, సంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి



## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి వినతిపత్రం అందజేత..

**ఇంటి స్థలం, పింఛను మంజూరు చేయాలని డిమాండ్..**

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిది ఏప్రిల్ 21

మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి ఆదుకోవాలని చౌటుప్పల్ మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర కాంక్షతో ఆనాడు అన్నీ వదులుకొని, ఉద్యమమే ఊపిరిగా పోరాటంలో పాల్గొన్నామని గుర్తుచేశారు. ఆ సమయంలో తమపై నమోదైన పోలీసు కేసులు, జైలు జీవితం వల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.?ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి.?వయస్సుతో నిమిత్తం లేకుండా ఉద్యమకారులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి.?ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ప్రయాణాల కోసం బస్ పాసులు మంజూరు చేయాలి.?ఇప్పటికీ నిరుద్యోగులుగా ఉన్న అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి.?అధికార పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఉద్యమకారులకు ప్రాధాన్యతనిస్తూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలి.?ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు కట్టెల లింగస్వామి, పెద్దగొని రమేష్, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, బోరం ప్రకాశ్ రెడ్డి, ఎస్.కె మున్న, గుంటొజు ఆంజనేయచారి, ఎండి ఇబ్రహీం, సంగిశెట్టి జనార్ధన్, రిక్కల ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..